ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

అంగన్‌వాడీలకు వేతనాలేవీ?

- మూడు నెలలుగా అందని వైనం
- ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మూడు నెలలుగా వేతనాలు అందక అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా పోషకాహారంతో కూడిన కూరలు వండాల్సి ఉంది. బిల్లులు సహజంగానే ఆలస్యంగా వస్తాయి కనుక తమ వేతనాల్లో కొంత వీటి కోసం వెచ్చించేవారు. బిల్లులు వచ్చాక సర్దుబాటు చేసుకొనేవారు. కానీ వేతనాలే నిలిచిపోవడంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

అంగన్‌వాడీ ప్రీస్కూల్

బాపట్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న కార్య కర్తలు, సిబ్బందికి గత మూడు నెలలుగా వేత నాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారు. బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి గత ఫిబ్రవరి వరకు అంగన్‌వాడీల వేతనాలు సక్రమంగానే వచ్చాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సజావుగానే వేతనాలు వస్తుండగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది వేత నాల చెల్లింపుల్లో సమస్యలు తలెత్తినట్లు చెబుతున్నారు. అంగన్‌వాడీలకు సంబంధించి ప్రతి నెలా 20న ప్రాతిపదికన వేతనాల కోసం బిలు ్లలను మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపుతున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి బిల్లులను తయారుచేసి సిఎఫ్‌ఎమ్‌ఎస్‌లో అప్‌లోడ్ చేయబోగా తీసుకోలేదు. అప్పటి నుంచి బిల్లులు ఏవీ కూడా అప్‌లోడ్ కానం దున మూడు నెలలుగా అంగన్‌వాడీలకు వేతనాలు అందలేదు. రాష్ట్రప్రభుత్వం అంగన్ వాడీ కార్యకర్తకు రూ.11,500, సహాయకు లకు రూ 7,500 చొప్పున గౌరవ వేతనం ఇస్తుంది. గడిచిన మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు.

సాంకేతిక కారణాలతో బిల్లులు సిఎఫ్ ఎమ్‌ఎస్‌లో అప్‌లోడ్ కావడం లేదని చెబు తున్నారని, సమస్యను పరిష్కరించి అంగన్ వాడీల వేతనాలు త్వరితంగా వచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అంగన్‌వాడీల సంఘం నేత ఎలిజిబెత్ రేఖ కోరారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే..

దేశ ఆర్థికవ్యవస్థకు మూలస్తంభం

- చిరుధాన్యాల సాగు విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అధునాతన సాంకేతికను సృష్టించు కుంటూ.. దాన్ని వినియోగించుకోవడంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాత్ర ఎనదగినదని, నూతన సాంకేతికతతో గత ఏడాది ఎనిమిది కొత్త వంగడాలను సష్టించి.. చరిత్ర సష్టించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్‌నజీర్ తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా నిలుస్తుందన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియంలో నిర్వహించిన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ 55వ వార్షిక స్నాతకోత్సవ సభలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో 66 శాతం ప్రజా

విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

జీవనం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందని, నేడు వ్యవసాయాన్ని పోషకాహార భద్రతే ప్రధానంగా పరిగణించి చేయడం శుభ పరిణామమన్నారు. రాష్ట్రంలోని కొత్త ప్రాంతాలలో చిరుధాన్యాల సాగును విస్తరించడానికి మరియు వివిధ జిల్లాల్లోని చిరుధాన్యాల గ్రామాలు/మండలాలను అభివద్ధి చేయడానికి విశ్వవిద్యాలయ పరిశోధన ఇంకా ఎక్స్టెన్షన్ విభాగాలు వ్యవసాయ శాఖ సహకారంతో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. యునెస్కో ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి ప్రజలకు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంలోని ఆవశ్యకతను తెలియజేసిందన్నారు. నేటి యువతరం పాజిటివ్ దక్పథాన్ని అలవర్చుకోవాలని, చెడు దక్పథాన్ని వెంటనే విడనాడి, సత్యం వైపు అడుగులేయాలని చెప్పారు. ఓటమి ద్వారా వచ్చే అనుభవం సాధించబోయే విజయానికి సంకేతంగా భావించాలని, అంకితభావంతో ▸ 2లో

'టెక్నాలజీ'తో

ఆట కట్టించారు.!

- రాధ హత్య కేసులో భర్తే హంతకుడు
- ఆర్థిక లావాదేవీలు, అనుమానమే కారణం!
- సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ తెలుసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి మల్లికగర్గ్

మాట్లాడుతున్న ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

మిస్టరీగా మారిన కోటా రాధ హత్య కేసును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేధించారు. నిందితుడు తనపై అనుమానం రాకుండా ఉండేందుకు తీవ్రంగా ప్రయత్నిం చినా.. పోలీసులు టెక్నాలజీతో అతని ఆట కట్టించారు. తగిన సాక్ష్యాధారాలతో నిందితుడిని విచారించగా నిందితుడిని తాను చేసిన నేరం అంగీకరించక తప్పలేదు. ఒంగోలులోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మల్లికగర్గ్ వివరాలు వెల్లడించారు.

కోటా రాధ(35) స్వగ్రామం వెలిగండ్ల మండలం, జిల్లెలమూడి గ్రామం. కోదాడ మండలం, సూర్యాపేట గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డికి రాధతో 2013లో వివాహమైంది. వీరికి మనోజ్ఞరెడ్డి (8), హన్సిక్‌రెడ్డి (4) సంతానం. మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లోని థర్మోఫిషర్ సైంటిఫిక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. రాధతో కలసి చదువుకున్న వెలిగండ్ల మండలం, గండ్లోపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి కాశిరెడ్డిని రాధ అతని భర్త మోహన్‌రెడ్డికి పరిచయం చేసింది. కాశిరెడ్డి మోహన్‌రెడ్డి వద్ద నుండి రెండు రూపాయల వడ్డీకి 50 లక్షల రూపాయలు తీసుకున్నాడు. అతను డబ్బులు తిరిగి ఇవ్వకపోగా వీరికి 2022లో ఐపి నోటీసులు పంపాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇతర కారణాలతో భార్యాభర్తలిద్దరికీ సుమారు రూ.1.27 కోట్ల అప్పులయ్యాయి. దీంతో భార్య, భర్తల మధ్య విబేధాలు మొదలై.. అప్పుడప్పుడూ మోహన్‌రెడ్డి భార్యను కొట్టేవాడు. రాధ ఆమె మగ స్నేహితులతో సన్నిహితంగా ఉండటంతో ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెను ఎలాగైనా అంతమొందిచాలని నిర్ణయించుకొని అవకాశం కోసం ఎదురుచూశాడు.

నేరం చేసిన విధానం

రాధ స్వగ్రామంలోని అమ్మవారి కొలుపులకు ▸ 2లో

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

- ప్రత్యేక స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్

8వ ▲

'టెక్నాలజీ'తో ఆట కట్టించారు.!

మొదటిపేజీ తరువాయి)

వచ్చిన నేపథ్యంలో అక్కడే ఆమెను అంతమొందించాలని మోహన్‌రెడ్డి పథకం వేశాడు. ఈ నెల 15న సంగారెడ్డి నుండి పఠాన్‌చెరువుకు వెళ్లే మార్గంలో చెరకు రసం బండి వద్దకు వెళ్లి.. అక్కడ చెరుకు రసం అమ్మే ఆమె వద్ద తన సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిందని ఫోన్ చేసుకొని ఇస్తానని చెప్పి.. ఆమె సెల్‌ఫోన్ తీసుకొని అందులోని సిమ్‌ను తీసుకుని తిరిగి ఫోన్ ఇచ్చేశాడు. అక్కడ నుండి మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆ సిమ్ ద్వారా భార్య రాధకు కాశిరెడ్డి పంపినట్లుగా మెసేజ్‌లు చేస్తూ ఉన్నాడు. 16న హైదరాబాద్, మాదాపూర్‌లోని లాంగ్ డ్రైవ్ రెంటెడ్ కార్స్ యాప్‌లో కియా కంపెనీకి చెందిన కారును బుక్ చేసుకున్నాడు. వెంటనే కాశిరెడ్డి పంపినట్లుగా కనిగిరిలో కలుద్దాం అని రాధకు మెసేజ్ చేశాడు. హైదరాబాద్ నుండి కారులో బయలుదేరి వినుకొండకు వచ్చి అక్కడ జియో సిమ్ కొనుగోలు చేసి దాని ద్వారా కాశిరెడ్డి పంపినట్లుగా కొన్ని మెసెజ్‌లు పంపాడు. అక్కడ నుండి వెళ్లి.. ఒంగోలు మౌర్యా హోటల్‌లో బస చేశాడు. రాధను కనిగిలిలో కలిసేందుకు ఈ నెల 17న సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలు నుండి బయలుదేరి కనిగిరికి వెళ్లాడు. మెసేజ్ పెట్టింది కాశిరెడ్డే అని భావించి.. కనిగిరికి వెళ్లిన రాధ పామూరు బస్టాండ్‌లో ఉన్న భర్త మోహన్‌రెడ్డిని చూసి.. నివ్వెరపోయింది. రాధను మోహన్‌రెడ్డి కారులో ఎక్కించుకుని పామూరు వైపు ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వాహనాన్ని నిలిపి భార్యతో వాగ్వివాదానికి దిగి.. ఆమె మెడలోని చున్నీతో ఆమెను హత్య చేశాడు. అదే వాహనంలో ఆమె మృతదేహాన్ని వేసు కొని రాత్రి 11 గంటల సమయంలో కనిగిరి- వెలిగండ్ల రోడ్డు, జిల్లెలపాడు గ్రామం వద్ద రోడ్డుపై ఆమె మృతదేహాన్ని ఉంచి.. కారుతో తొక్కించి రోడ్డుప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి.. అక్కడ నుండి మోహన్‌రెడ్డి అదే వాహనంలో మిర్యాలగూడకు వెళ్లాడు. తరువాత తన భార్య మృతి గురించి బంధువుల ద్వారా తెలుసుకొని.. తనకేమీ తెలియనట్లు వచ్చి.. దహన సంస్కారాలు నిర్వహించారు.

టెక్నాలజీతో ఆటకట్టు..

ఈ కేసులో పోలీసులు ఓ వైపు కాశిరెడ్డిని విచారిస్తూనే.. మరో వైపు మోహన్‌రెడ్డి కదలికల్ని టెక్నాలజీ సాయంతో పరిశీలించారు. మోహన్‌రెడ్డి హత్యకు ముందు రోజు ప్రకాశం జిల్లాలో ఉన్నట్లు తెలుసుకొని.. అతనిపై మరింత నిఘా పెట్టి.. విచారించగా నిందితుడు భర్తే అని తేలింది.

అభినందన

ఈ కేసును స్వల్పవ్యవధిలో ఛేదించిన జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్, ఎయస్‌పి (క్రైం) శ్రీధర్, కనిగిరి ఎస్‌డిపిఒ రామరాజు, సిఐ కె.శ్రీనివాసరావు, ఐటి కోర్ టీం ఎస్సై అజేయ్‌కుమార్, వెలిగండ్ల ఎస్సై కె.సురేష్, సిబ్బందిని రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించి.. రివార్డులు ప్రకటించారు.

నిమ్మచెట్లు నరికి వేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి - అర్ధవీడు

గతంలో భూమిని అమ్మిన వారే తాము అమ్మలేదని, పొలంలోని నిమ్మచెట్లను దౌర్జన్యంగా నరికి వేసినట్లు అర్ధవీడుకు చెందిన రైతు బంకపల్లి అప్పలస్వామి వాపో యాడు. రైతు సంఘం జిల్లా నాయకుడు గాలి వెంకట రామిరెడ్డితో కలిసి అప్పలస్వామి సోమవారం మాట్లాడారు. దొంత అల్లూరమ్మ అనే మహిళ వద్ద తాను అర్ధవీడు మండలం పాపినేనిపల్లె గ్రామ సర్వే నెంబర్ 8/4/3లో ఎ 2.70 సెంట్లు, సర్వే నెంబరు 815/3 లో రెండున్నర ఎకరాల భూమిని తాను కొనుగోలు చేసినట్లు అప్పలస్వామి తెలిపారు. 1996లో తన పేరుతో రిజిస్ట్రేషన్ కూడా అయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ భూముల విలువ పెరగడంతో ఆమె కుమారులు ఆభూమిని తాము అమ్మలేదని అడ్డంతిరిగినట్లు తెలిపారు. ఈ విషయంపై 2014లో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గిద్దలూరు మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించగా కోర్టులో తనకు అనుకూలంగా వచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ తాను పొలంలో నాటిన నిమ్మ మొక్కలను నరికి వేసినట్లు అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై గిద్ద లూరులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గాలి వెంకట్రామిరెడ్డి తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామసభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ నేపథ్యంలో ముందుగా గ్రామాల్లో ఉపాధి పని చేస్తున్న ప్రతి ఒక్కరు వద్దకెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని గ్రామ సభలో చర్చించారు. శింగరాయకొండ గ్రామపంచాయతీలో 158 పనులు చేయగా రూ.86,28, 832 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పని వంద రోజులు కావాల్సి ఉండగా పూర్తిస్థాయిలో జరగలేదని. ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించే విధంగా చూస్తామని అధికారులు తెలిపారు. గ్రామంలో నాటిన 250 మొక్కలు కనిపించడం లేదని అధికారులు తెలిపారు. ఈ గ్రామ సభలో ఎపిఒ సుధాకర్, ఎంపిటిసి షేక్ షకీలా, డిఆర్‌పి కరుణాకర్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆర్.సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ కొండలరావు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

నిబంధనలకు తూట్లు

గ్రామసభలో గ్రామ పంచాయతీ అధికారులు నిబంధనలకు తూట్లు పొడిచారు. గ్రామసభ సర్పంచి అధ్యక్షతన నిర్వహించాల్సిఉంది. సర్పంచి అందుబాటులో లేకపోతే ఉప సర్పంచి అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. ఇద్దరూ లేనప్పుడు వార్డు సభ్యులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించాల్సిఉంది. అధికారులు వార్డు సభ్యులను పట్టించుకోకపోవడం గమనార్హం. గ్రామ సభలను అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగా పంచాయతీ అధికారులు పనిచేయటం విశేషం. గ్రామ సభకు వార్డు సభ్యులు షేక్ కరీం, పాదర్తి కోటేశ్వరరావు, పడిదపు రవికుమార్ హాజరయ్యారు. నిబంధనలకు తుట్లు పొడిచిన గ్రామపంచాయతీ అధికారులు అధికార పార్టీ నాయకులకు మెప్పుకోసం ఎంపిటిసిలకు ప్రాధాన్యత ఇచ్చారు. వార్డు సభ్యుల గురించి పట్టించుకోలేదు.

నల్లూరివెంకటశేషయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్లబుచ్చయ్య చౌదరి

నల్లూరి వెంకటశేషయ్యకు సత్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

నల్లూరి పౌండేషన్ అధినేత,ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకట శేషయ్యను రాజమండ్రి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఘనంగా సత్కరించారు. దివంగత ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రవాసాంధ్రుల ఆధ్వర్యంలో దుబాయ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చయ్య చౌదరి పాల్గొని నల్లూరి వెంకటశేషయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ నల్లూరి పౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటశేషయ్య చేస్తున్న సేవలను కొనియాడారు. కెవి పాలెంను దత్తత తీసుకొని గ్రావ రాభివృద్ధికి చేస్తున్న కృషిని అభిన ందించారు. నల్లూరి వెంకటశేషయ్య మాట్లాడుతూ ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా తనను గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం

(మొదటిపేజీ తరువాయి)

కృషి చేసిననాడే విజయం వరిస్తుందని పిలుపునిచ్చారు. ఈ స్నాతకోత్సవంలో 1476 మంది విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిలో 993 మంది ప్రత్యక్షంగానూ, 483 మంది పరోక్షంగానూ అందుకున్నారు. అగ్రికల్చరల్ సైన్సెస్‌లో అత్యుత్తమ అత్యుత్తమ పరిశోధనలకుగాను డాక్టర్ ఎం.వి. రెడ్డి జాతీయ అవార్డు -2023ను డాక్టర్ ఇఎ అబూ బకర్ సిద్ధిక్, గౌరవ ప్రొఫెసర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయో టెక్నాలజీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌కు ప్రధానం చేయగా వ్యవసాయ శాస్త్రాలలో అత్యుత్తమ పరిశోధనలకు గానూ వి.రామచంద్రరావు జాతీయ పురస్కారం-2023ను ప్రొఫెసర్ నాగేంద్ర కుమార్ సింగ్, నేషనల్ ప్రొఫెసర్, బి.పి. పాల్చైర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ బయో టెక్నాలజీ పియుఎస్ఎ క్యాంపస్, న్యూఢిల్లీకి ప్రదానం చేశారు.

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు 19,727 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనం మరియు 26,186 క్వింటాళ్ల మూల విత్తనాన్ని వద్ధి చేయడమే కాక మొత్తం 51,248 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తిచేసి రైతులకు తోడ్పాటునందించాలరని ఈ విజయానికి యూనివర్సిటీ అధ్యాపకులు మరియు విద్యార్థుల కషిని గవర్నర్ అభినందించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ రెడ్డి నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ మాజీ సెక్రెటరీ మరియు టాస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ పరోడ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు మరియు ఎపి లెజిస్లేటివ్ కౌన్సిల్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్నాహక సభకు తరలిరావాలి

పిసిపల్లి : ఎస్‌సి వర్గీకరణ లక్ష్యసాధనకై ఈ నెల 23న ఉమ్మడి ప్రకాశం జిల్లా హెచ్‌సిఎం కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సన్నాహక సభకు మాదిగలు వందలాదిగా తరలి రావాలని ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ నందిపాటి సుధీర్ మాదిగ, గంగవరపు రోజెస్ మాదిగ కోరారు.

IN THE HON'BLE COURT OF THE IVTH ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
O.S.No. 30/2022

Between :
Sri Tharlada Adinarayana. ....PLAINTIFF
And:
Sri Rangisetty Mallikarjuna. ...DEFENDANT

Defendant Address

Sri Rangisetty Mallikarjuna, S/o. late Srinivasulu, Door No. 5-11, Kalikavaya Bitragunta Village, Janugumalli Mandal, Prakasham District, (AP) Pin No. 523 101, Phone Nos. 09948328186, 9704550644, What's up No. 9000999644.

NOTICE

Please take notice that the above named plaintiff field the above suit against you for recovery of the suit amount due under the promissory note and the matter coming for your appearance and stands posted to **19-6-2023 at 10-30 AM** for your appearance in the above named court in person or through a pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings, in default of your appearance on that day the matter will be decided exparte as per Law.

(BY COURT ORDER)

I.SURESH,
PALLA RAVI,
Advocates,
VIZIANAGARAM-AP
Cell No. 94408 63666

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలోగల మందిరం బజారుకు చెందిన **సానికొమ్ము విజయగోపాల్‌రెడ్డి,** తండ్రి **మల్లారెడ్డికి** కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం గ్రామంలోని **సర్వేనెం.331** లేఅవుట్‌లోని **18, 19, 20** నెంబర్లు గల ప్లాట్లుకు సంభందించిన **252.22 చదరపు గజముల** స్థలము కలదు. సదరు స్థలానికి సంభందించిన **నెం.4079/2018 గల ఒరిజనల్ లింక్ డాక్యుమెంట్ తే09-04-2023దిన** కనిగిరి నుంచి పామూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా పోయినది. ఈ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
కె.వి.ఆర్.ఎన్.ముత్యప్రసాద్
అడ్వకేట్, మంగళగిరి,
సెల్ నెం: **9885574113**

డిఎస్‌పిని సన్మానిస్తున్న నాయకులు

డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి-పొదిలి

దర్శి డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డిని వైసిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్మ శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, నగర పంచాయతీ బిసిసెల్ అధ్యక్షుడు పులగొర్ల శ్రీనివాస్ యాదవ్, ముల్లా జాకీర్, పాములపాడు సర్పంచి పేరం కోదండ రామిరెడ్డి, తుమ్మగుంట సర్పంచి అంబవరపు నారాయణరెడ్డి, యువనాయకుడు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME & DOB

I, PADMAVATHI
M/O. No.15334036W, SPR(MACP HAV)
VENKATA PRABHAKAR K,
Unit:21 Engr Regt, C/O 56 APO,
Allinagaram Village & Post,
Komarolu Tehsil, Prakasam Dist, A.P.,
Here by declare that I have Changed my Name From **PADMAVATHI** to **KATTERA GANDLA PADMAVATHI** and my Date of Birth from **01.07.1965** to **01.01.1961** vide affidavit dated: 17.05.2023

CHANGE OF NAME

I, **MAJETY SINDHURA**, (Old Name) W/o. **BOMMISETTY LAKSHMI NARAYANA PRASAD**, resident at D.No.24-34-287, Annavarappadu 2nd line, Opp: Anand Nursary, OngoleTown & Mandal, Prakasam District, Andhra Pradesh.
I have changed my name from **MAJETY SINDHURA** to **BOMMISETTY LAKSHMI SINDHURA** (New name) W/o. **BOMMISETTY LAKSHMI NARAYANA PRASAD**, Hence forth i will be known as **BOMMISETTY LAKSHMI SINDHURA** will be applicable for all purposes

పబ్లిక్ నోటీస్

బాపట్ల జిల్లా, అద్దంకి పట్టణం & మండలం, దమవారిపాలెం, డోర్ నెం.18-44/1 కాపురస్తులు **తాటి అంక ప్రసన్న రావు, తండ్రి: అప్పారావు(లేటు)** మాకు ఇచ్చిన సంజాయిషి మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా నా క్లయింటు ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి గ్రామం మరియు నగరపంచాయతి, వార్డు నెం.7, గాంధీనగర్ తూర్పువైపు, అయ్యప్పనగర్, **సర్వే నెం.23 లోని ఎ.4-92 సెంట్లలోని 41 గదులు లేదా 327.8 చ॥గ॥లు** విస్తీర్ణములో నిర్మితమైన, పాత అసెస్‌మెంట్ నెం.5016, కొత్త అసెస్‌మెంట్ నెం.1149003781లో డోర్ నెం.7-653(3) తో గల ఆర్‌సిసి బిల్డింగ్‌నకు నిజమైన యజయాని మరియు హక్కుదారుడు. దీనికి హద్దులు, **తూర్పు:** 20-00అ॥ల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** మొగళ్ళ ఇమ్రాన్‌ఖాన్ యొక్క స్థలము, **పడమర:** 15-00అ॥ల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** గుండా చిన వెంకటేశ్వర్లు యొక్క స్థలము, మరియు అతను ఈ ఆస్థిని చీమకుర్తి ఎస్‌ఆర్‌ఓలో రిజిష్టరు కాబడిన **విక్రయ దస్తావేజునెం.882/2015** ద్వారా పొందియున్నారు. ఇంకా, అతను చీమకుర్తి ఎస్‌ఆర్‌ఓలో రిజిష్టరు కాబడిన **ఓరిజినల్ లింకు దస్తావేజు నెం.3007/2009, 189/2005, 1064/2012, మరియు 937/2015** లను పోగొట్టుకున్నారు. ఎంతగా వెతికినను ఈ రోజు వరకూ అవి కనబడలేదు. చివరిగా ఆయన అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు దస్తావేజులు దొరకలేదని సర్టిఫికెట్‌ను జారీచేయడం జరిగినది. ఇప్పుడు నా క్లయింటు **"ఐసిఐసిఐ హౌసింగ్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్"**, గుంటూరు వారిని పైన తెలిపిన ఆస్థిని తనఖా వుంచి ఋణమును పొందుటకు కలిసియున్నారు. ఇందుమూలముగా యావన్మందికి ఈ నోటీసు ద్వారా నేను తెలియజేయునది ఏమనగా, ఎవరికైనను సదరు దస్తావేజులు దొరికినయెడల లేదా సదరు ఆస్థి గురించి గాని, హక్కులు గురించిగాని అభ్యంతరము ఉన్నయెడల లిఖితపూర్వకముగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించబడిన **10** దినములలోపు ఈ క్రింది సంతకందారుని సంప్రదించగలరు. లేని యెడల ఎవరికీ, ఎటువంటి అభ్యంతరములు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింటు దిగువ షెడ్యూలు ఆస్థిపై ఋణము తీసుకొనగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములు మా క్లయింటును గాని, ఋణదాతను గాని బద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

స్థలం : ఒంగోలు
తేది: 22-05-2023

శ్రీ చల్లా వెంకటప్పారెడ్డి, న్యాయవాది,
24-1-19, పాత గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురు, ఒంగోలు,
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9848044909,

బైటమంజులూరులో..

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పంగులూరు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మరణించిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని బయట మంజులూరు గ్రామంలోని దళితవాడలో జరిగింది. కుటుంబ సభ్యులే తమ కూతుర్ని చంపి, ఆత్మహత్యగా సృష్టిస్తున్నారని, మృతురాలు సందిపాగు మేరమ్మ(22) తల్లిదండ్రులు రేణింగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం, పూరిమెట్ల గ్రామానికి చెందిన గోచిపాతల ప్రభుదాస్, పెద్ద కుమారి దంపతుల కుమార్తె మేరమ్మను పంగులూరు మండలం బయటమంజులూరు గ్రామానికి చెందిన సందిపాగు నాగేశ్వరరావుకు ఇచ్చి నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వీరికి మూడు సంవత్సరాల కుమార్తె శ్రీవల్లి, సంవత్సరం కుమారుడు అభిరామ్ ఉన్నారు. పెళ్లయిన తర్వాత ఏడాది పాటు సజావుగానే సాగిన వారి సంసారం గత మూడేళ్లుగా నిరంతరం గొడవలతో సాగుతోందని మృతురాలు తల్లిదండ్రులు పెద్ద కుమారి, ప్రభుదాసు విలేకరులకు తెలిపారు. ఈ సంవత్సరం భార్యాభర్తలు మొగిలిచర్లలో పచ్చాకు పనికి వెళ్లారు. అక్కడ కూడా భార్యాభర్తల మధ్య గొడవలు కొనసాగి నాగేశ్వరరావు భార్యను కొట్టాడని, ఈ విషయమై మొగిలిచర్ల పోలీస్‌స్టేషన్లో పంచాయతీ చేసి తల్లిదండ్రులు ఆమెను పూరిమెట్ల తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే గత 15 రోజుల

మృతురాలు మేరమ్మ (ఫైల్)

మనుమడు, మనుమరాలితో మేరమ్మ తల్లి పెద్దకుమారి

క్రితం మేరమ్మ తల్లిదండ్రులను బ్రతిమలాడుకొని ఒప్పించి పెద్దమనుషుల సమక్షంలో భర్త నాగేశ్వరరావు మేరమ్మను స్వగ్రామమైన బయట మంజులూరు తీసుకువచ్చాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో బయట మల్లెపూలు కోస్తున్న మేరమ్మను చూశామని, అనంతరం ఇంట్లోకి వెళ్లిందని, తరువాత ఏం జరిగిందో తమకు తెలియదని స్థానికులు తెలిపారు. ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో మేరమ్మ ఆత్మహత్య చేసుకుందని, ఎవరికీ చెప్పకుండా కుటుంబ సభ్యులే ఆటో తీసుకొచ్చి మేరమ్మను ఆసుపత్రికని తీసుకెళ్లారని, తరువాత చనిపోయినట్లు తెలిసిందని దళిత కాలనీవాసులు తెలిపారు. అయితే మేరమ్మను భర్త నాగేశ్వరరావు, అత్తమామలు కలిసి మెడకు చున్నీ వేసి, గొంతు నులిమి చంపారని, సాక్ష్యాలు తెలియకుండా ఉండేందుకు చున్నీని తగులపెట్టారని, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మేరమ్మ నిజంగా ఆత్మహత్య చేసుకుంటే కాలనీలో ఉన్న చుట్టుపక్కల వారిని పిలవాలని, కానీ అలా చేయకుండా ఎవరికీ తెలియకుండా రహస్యంగా ముప్పవరం ఆర్ఎంపీ దగ్గర తీసుకెళ్లారని, అక్కడి నుంచి మేదరమెట్ల హాస్పిటల్‌కు, అక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు తీసుకువెళ్లారని తల్లిదండ్రులు తెలిపారు. స్థానికులు తమ బిడ్డ చనిపోయిందని సమాచారం ఇస్తే గాని తమకు తెలియలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై అద్దంకి రూరల్ సీఐ ఉమేష్, కోరిశపాడు ఎస్ఐ చౌదరి సోమవారం ఉదయం బయటమంజులూరులోని సంఘటన జరిగిన ఇంటిదగ్గరకు వచ్చి పరిశీలన చేశారు. అక్కడ కాలిపోయిన చున్నీ వారికి కనిపించిందని, ఈ విషయమై పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తమ బిడ్డను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న భర్త నాగేశ్వరావును, అత్తమామలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, తమ మనవడు, మనవరాలికి దారి చూపించాలని మృతురాలి తల్లిదండ్రులు పెద్దకుమారి, ప్రభుదాసు విలపించారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కొల్లూరు

జిల్లా వైసీపీ యూత్ విభాగం అధ్యక్షులు మేరుగ చందనాగ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. ఈ క్రీడలు కొల్లూరు జడ్పీహెచ్ హైస్కూల్ గ్రౌండ్‌లో సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, తద్వారా ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని చెప్పారు. కొల్లూరులో మినీ స్టేడియం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరానని, అది నిర్మించుకోగలిగితే జిల్లా టోర్నమెంట్లు కూడా జరుపుకోగలమని అన్నారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 100 టీములు పాల్గొంటున్నాయి. గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా లక్ష రూపాయలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్పీ

అర్జీలపై విచారణ జరిపిస్తాం: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: ప్రజల నుంచి వస్తున్న అర్జీలపై విచారణ జరిపి చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూవివాదాలు, ఆర్థికపరమైన అంశాలు, ఇతర సమస్యలతో మొత్తం 67 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అడిషనల్ ఎస్పీ పి మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ మాలకొండయ్య పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించండి

ప్రజాశక్తి-వేటపాలెం

గొడవల వల్ల ఉపయోగమేమీ లేదని, సమస్యలేవయినా ఉంటే సామరస్యంగా కూర్చుని పరిష్కరించుకోవాలని రాష్ట్ర మత్స్యకార కోపరేటివ్ సొసైటీ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని కటారివారిపాలెం, రామాపురం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అలజడి వల్ల ప్రజలు నష్టపోతారని సూచించారు. జరిగిన గొడవల్లో తప్పు ఎవరిదైనా సామరస్యంగా పరిష్కరించుకొని పోలీసు వారికి సహకరించాలన్నారు ఈ నెల 24వ తేదీ జరగనున్న చర్చలలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి టి వెంకటేశులు, చీరాల రూరల్ సీఐ ఏ మల్లికార్జునరావు, వేటపాలెం ఎస్ఐ జి సురేష్, ఈపురుపాలెం ఎస్ఐ జనార్ధన్ తదితరులు ఉన్నారు.

గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

పోలీసుల అదుపులో 28 మంది పెద్దలు

మండలంలోని రామాపురం కటారిపాలెం గ్రామాలలోని 20 మంది పెద్దలను సోమవారం చీరాల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కటారివారిపాలెం శివారు గ్రామంలో గుడిసెలు వేసుకొని ఉన్న 150 మంది వద్ద నుంచి కటారిపాలెం గ్రామ పెద్దలు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కటారివారిపాలెం గ్రామస్తులు మాత్రం రామాపురం గ్రామంపై దాడి చేసి కొట్టేది కొట్టేదేనంటూ పోలీసులతోనే బాహాటంగా చెబుతున్నారని నానుడి ఉంది పోలీసుల నుండి పాత్రికేయులకు ఎలాంటి సమాచారం అందటం లేదు

బాధిత కుటుంబానికి సహాయం అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు: భట్టిప్రోలులోని అద్దేపల్లిలో ఈ నెల ఏడో తేదీన విద్యుత్ షార్ట్ షార్ట్యూట్ కారణంగా పూరిల్లు కాలిపోయి ఓ వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబానికి సహృదయ ఫౌండేషన్ సహకారంతో సోమవారం వంట సామగ్రి, నిత్యావసర సరుకులను సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, జి సుధాకర్‌ల చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన అమృతలూరి సౌదామని గృహంతో పాటు ఇంటిలో నిద్రిస్తున్న కుమారుడు మంటలకు శరీరం పూర్తిగా కాలిపోయి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా సౌదామని కుటుంబానికి సహృదయ ఫౌండేషన్ సహాయం అందించటం అభినందనీయమని కృష్ణమోహన్ కొనియాడారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సిఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేందుకు మంత్రి నాగార్జున కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్, సిపిఎం నాయకులు జి నాగరాజు, అనిల్ తదితరులు ఉన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించిన పదో తరగతి ఇంటర్మీడియట్ జూన్, జూలై పబ్లిక్ పరీక్షల అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించే గడువు ఇతర వివరాలను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సోమవారం విలేకరులకు తెలిపారు. పరీక్ష రుసుము చెల్లించేందుకు గడువు తేదీల వివరాలను ప్రకటించారు. ఎపి ఆన్‌లైన్, మీసేవ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు ఏ విధమైన అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు అన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు ఒక సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుముతో చెల్లించాలన్నారు. జూన్ 3 నుంచి 5 వరకు ఒక సబ్జెక్టుకు రూ.50 అపరాధ రుసుముతో చెల్లించాలన్నారు. ఇంటర్ తత్కాల్ రుసుము రూ.వెయ్యి చెల్లించాలన్నారు. పదో తరగతికి అయితే రూ.5 వందలు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలను మండల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిగి తెలుసుకోవాలన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రేయసి దీక్ష

నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి మొరాయిస్తున్న ప్రియుడు ● వివాహం జరిపించాలని యువతి కుటుంబ సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-చీరాల

ప్రేమించాడు జీవిత భాగస్వామిని చేసుకుంటానని నమ్మించాడు పెద్దల సమక్షంలో వివాహం చేసుకుందామని ప్రేయసిని ఒప్పించాడు. కట్ చేస్తే చివరికి నిశ్చితార్థం చేసుకుని వివాహం చేసుకునేందుకు ఆ ప్రియుడు అంగీకరించకపోవడంతో దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిన ప్రేయసి ఆ ప్రియుడి ఇంటి ముందు బైఠాయించి దీక్ష చేపట్టింది. ఈ ఘటన చీరాల పట్టణంలోని హారిస్‌పేటలో సోమవారం వెలుగులోకి చూసింది. వివరాల్లోకి వెళితే.. చీరాల మండలం థామస్ పేటకు చెందిన డి ప్రియ, ఆ వెంటే ఉండే హయ్యర్ పేటకు చెందిన డి దేవానంద్ గత 7 సంవత్సరాల క్రితం ప్రైవేటు కళాశాలలో చదువుతున్న సమయంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం ప్రియ పట్టణంలోని ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తుండగా దేవానంద్ తండ్రి చేస్తున్న వ్యాపారంలో సహకరిస్తున్నాడు. వీరి ప్రేమ విషయం పెద్దలకు తెలియటంతో వారి సమక్షంలో ఈ సంవత్సరం జనవరి నెలలో ఇద్దరికీ నిశ్చితార్థం కూడా చేశారు. అనంతరం ఏమైందో తెలియదు కానీ దేవానంద్ ప్రియను వివాహం చేసుకోనని నిరాకరిస్తున్నాడు. దీంతో మూడు రోజుల క్రితం ప్రియ ఈ విషయంపై ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే దేవానంద్ నేటికీ మార్పు రాకపోవటంతో తనకు నాయ్యం చేయాలని ప్రియుడి ఇంటి ముందు ప్రియ బైఠాయించి నిరసన చేపట్టింది. దేవానంద్‌తో తన వివాహం జరిపించి న్యాయం చేయాలని యువతి కోరుతుంది. నిశ్చితార్థం చేసుకున్న ప్రియుడితోనే తనకు వివాహం జరిపించాలని, అప్పటివరకు తాను దీక్ష విరమించేది లేదని భీష్మించుకొని దీక్షను ప్రేయసి కొనసాగిస్తూనే ఉంది.

ప్రియుడి ఇంటి ముందు దీక్ష చేస్తున్న ప్రియ, వివాహ నిశ్చితార్థ వేడుకలలో ప్రియ, దేవానంద్

అర్జీదారులను తిప్పించుకోవద్దు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం అధికారులకు మంచి పద్ధతి కాదని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా అన్నారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు మా సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరుకు వినతి పత్రాలను అందించారు. స్పందనలో మొత్తం 110 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలో ఉన్నవాటికి తక్షణమే కలెక్టరు పరిష్కారమార్గం చూపారు. మిగిలిన వాటిని పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జగనన్నకు చెబుదాం, స్పందన వెబ్ సైట్లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు చెప్పారు. పోర్టల్లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనపై నిర్లిప్తంగా ఉండరాదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు. అర్జీదారులకు ఇబ్బందులు కలిగించరాదని కలెక్టరు సూచించారు. పక్కా గృహ నిర్మాణాలలో పురోగతి సాధించేలా ప్రతి జగనన్న కాలనీకి ప్రత్యేక అధికారులను నియమించాలని జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని కాలనీలకు నియమించిన అధికారులు బాధ్యతగా పనిచేసేలా చూడాలన్నారు. ఆ మేరకు సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. స్పందన పోర్టల్లో అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చూడాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. గడువు తీరినప్పటికీ వివిధ శాఖలలో అర్జీలు పెండింగ్లో ఉండడంపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టరు రంజిత్ బాషా

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోన రఘుపతి

బాపట్లను మరోసారి సందర్శించండి

గవర్నర్‌తో కోన సంభాషణ

ప్రజాశక్తి-బాపట్ల

చారిత్రక నేపథ్యం గల అందమైన ఊరు బాపట్లను మరోసారి తప్పనిసరిగా సందర్శించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి ఆత్మీయంగా కోరారు. సోమవారం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాల్లో పాల్గొనేందుకు బాపట్ల విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కోన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని అతిథి గృహం వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాపట్లకు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కోన అన్నారు. అయితే చారిత్రక నేపథ్యం ఉన్న బాపట్లను మీరు తనివితీరా మరోసారి తిలకించాలని కోరారు. ఒక గొప్ప తపనతో, సంస్కారంతో ఎందరో ముద్దుబిడ్డలు బాపట్ల వ్యవసాయ కళాశాల ద్వారా జాతీయ స్థాయిలో బాపట్ల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని ఎమ్మెల్యే కోన అన్నారు. తన తండ్రి కోన ప్రభాకర్‌రావు ఈ ప్రాంతానికి చేసిన సేవలను గవర్నర్‌కు తెలియజేశారు. ఘనమైన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన బాపట్లలోని భావదేవుని ఆలయ చరిత్రను సంక్షిప్తంగా గవర్నర్‌కు వివరించారు. సుప్రసిద్ధ సుందర మనోహర తీరంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక అందాలను తిలకించాలన్నారు. భారతదేశంలోని ఒక చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఊరుగా, ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను గవర్నర్‌కు వివరించారు. మరోసారి మీరు బాపట్ల వచ్చి మేము ఇచ్చే గౌరవ ఆతిథ్యాన్ని స్వీకరించాలని గవర్నర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, పలువురు అధికారులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

హుండీ ఆదాయం రూ.2,29,521

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేట శివారులో ఉన్న కనక నాగవరపమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఐదు నెలల నుంచి భక్తులు వేసిన కానుకలకు సంబంధించిన మూడు హుండీ లెక్కించగా రూ.2,29,521/-(రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల ఐదు వందల ఇరవైయి ఒక రూపాయలు) వచ్చాయి. వచ్చే నెల ఏరువాక పౌర్ణమి జూన్ మూడో తేదీన అమ్మవారి శిడి మహోత్సవం సందర్భంగా ముందుగా హుండీ లెక్కించారు. హుండీ లెక్కింపు ప్రత్యేక అధికారిగా బాపట్ల జిల్లా భావన్నారాయణ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటేశ్వరావు పర్యవేక్షణలో లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏ భానుమూర్తి, బండ్ల బాబు, ఈవో జీవీల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ బాబు, అటెండర్ ప్రవీణ్ కుమార్, ప్రసాద్, అర్చకులు ఏడుకొండలు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హుండీలో వేసిన కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

విలేకర్లతో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

ప్రజలను వంచిస్తున్న ముఖ్యమంత్రి జగన్

టిడిపి చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య విమర్శ

ప్రజాశక్తి-వేటపాలెం

నవరత్నాలు పేరుతో ప్రజలను వంచిస్తున్న ముఖ్యమంత్రి జగన్ అని చీరాల టిడిపి ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య విమర్శించారు. సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ఎస్సి, ఎస్టీ, బీసి, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.31 వేల కోట్లు బడ్జెట్లో చూపించారన్నారు. లక్షా అరవై కోట్లు ఖర్చులో చూపారని ఆరోపించారు. రూ.70 వేల కోట్లు నిధులు నవరత్నాలు పథకాలకు డైవర్ట్ చేసి నిరుపేదలను నిలువునా వంచించిన మోసగాడన్నారు. ఏడు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో టిడ్కో కింద కట్టిన రెండు లక్షల 70 వేల ఇళ్ళు పిచ్చుకలు, పావురాళ్ల గూళ్ల కట్టి నివసింస్తుంటే లబ్ధిదారులైన ఆపేద ప్రజలకు గృహ వసతిపై ప్రేమలేదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో 2,165 మంది నామినేటెడ్ పోస్టుల్లో తన సొంత వర్గానికి 67 శాతం నియమించి, మిగిలిన 33శాతం జనాభాలో 50 శాతం పైగా ఉన్నటువంటి బిసీలకు కేటాయించడం బిసిల పట్ల జగన్‌కు ఉన్న సవతి ప్రేమను తెలుపుతుందన్నారు. చీరాల్లో 417 కోట్ల రూపాయలతో చీరాల్లో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, రాష్ట్రం అప్పుల్లో ఓవర్ డ్రాఫ్‌తో పరిపాలన సాగుతుంటే ఇది సాధ్యమా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారథి, సాసిక భద్రయ్య, పొగడదండ వెంకటేశ్వర్లు, జి శ్రీనివాసరావు, ఎస్కే మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న రేపల్లె ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి

'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి రేపల్లె వేమూరు నియోజకవర్గాల్లోని ప్రజలు సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి అన్నారు. రేపల్లెలో ఏర్పాటయిన ఆర్డీవో కార్యాలయంలో స్పందనతో ప్రజా సమస్యలను పరిష్కరించే గ్రీవెన్స్ నిర్వహణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పార్థసారథి మాట్లాడుతూ 8 అర్జీలు కొత్తగా వచ్చాయని, వీటిని ఆయా శాఖ అధికారులకు పరిష్కరించేందుకు పంపినట్లు తెలిపారు. కుల ధృవీకరణ పత్రం ఇప్పించాలని రెండు అర్జీలు, రోడ్డు సర్వే చూపించాలని రెండు అర్జీలు, ఫిషరీస్‌కు సంబంధించి సొసైటీ ఎన్నికలు జరిపించాలని ఒక అర్జీ, ఆన్‌లైన్ అడంగల్‌లో పేర్లు తొలగించేందుకు ఒక అర్జీ, ప్రభుత్వ భూమి ఆక్రమణలు తొలగించడానికి ఒక అర్జీ, ఎంకరేజ్మెంట్ ఆఫ్ ఇరిగేషన్ కెనాల్ సర్వే చేయవలసిందిగా ఒక అర్జీ, మొత్తం 8 అర్జీలు నమోదు అయినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఏ శాఖకు సంబంధించిన అర్జీ సమస్య గురించయినా సంబంధిత శాఖకు పంపవచ్చని అన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వచ్చిన 8అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పార్థసారథి అధికారులను ఆదేశించారు. రేపల్లెలో నూతనంగా ఏర్పడిన ఆర్డీవో కార్యాలయంలో రేపల్లె వేమూరు నియోజకవర్గ ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు. ఈ స్పందనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెం మండలంలోని పిట్టలవానిపాలెం, ఖాజీ పాలెం, చందోలు, అల్లూరు గ్రామాల్లోని ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పని కల్పించాలని, గత సంవత్సరం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ సోమవారం డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ వందరోజుల పని చట్టంలో ఉన్నా పని ఎవరికీ చూపించడం లేదని అన్నారు. గత సంవత్సరం బిల్లులు కూడా పెండింగ్ ఉన్నాయన్నారు. కనీస సౌకర్యాలైన మంచినీరు, నీడ, మెడికల్ కిట్టు సౌకర్యాలు కల్పించట్లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం నిధులు గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం నిధులు కూడా తగ్గించడం దారుణమని అన్నారు. గతంలో ఒక పూట పని మాత్రమే ఉండేది. ఇప్పుడు కూలీలని, పేదలని పనికి దూరం చేయడం కోసం రెండు పూటలా పనిచేయాలనే నిబంధన తెచ్చారని విమర్శించారు. దీనిని రద్దుచేసి ఒక పూట పనినే కొనసాగించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్య తీసుకోవాలని అన్నారు. ఫొటో తీసే విధానాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో లాగా ఉపాధి కూలీలకు ఎండల్లో పని చేసినందుకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, పనిముట్లకు కూడా డబ్బులు ఇవ్వాలని, రెగ్యులర్‌గా ప్రతివారం ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కె శరత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న శరత్

పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పరిధిలోని మద్దిరాలపాడు వైసిపి కార్యాలయంలో పిడిసిసి బ్యాంకు జిల్లా డైరెక్టరు పెనుబోతు రంగారావు ఆధ్వర్యంలో జగన్న సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా మనఊరు- మన ఎమ్మెల్యే జగన్న కుటుంబ సమావేశాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను 90 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరందన్నారు. ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన 14 సంవత్సరాల హయాంలో చేయలేని అభివద్ధి, సంక్షేమానికి జగన్ మోహన్‌రెడ్డి తన నాలుగు సంవత్సరాల పాలనలో ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించేందుకు మనఊరు- మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, వైసిపి వాణిజ్యపు విభాగం రాష్ట్ర కార్యదర్శి నలమలపు కష్ణారెడ్డి, ఆరోగ్య శ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి యాదల అశోక్, ఎఎంసి మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కె. విజయకుమార్ ,ఎంవి. శేషయ్య, పరంధామి రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పి. శ్రీమన్నారాయణ, వైసిపి గ్రామ అధ్యక్షుడు మండవ లక్ష్మినారాయణ, కె. సుధాకర్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి
- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకుకలెక్టరేట్ వద్ద ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెతలు నానాటికి అధికమవుతున్నాయని, వారి సమస్యలు తీరే విధానం దరిదాపుల్లో కానరావడం లేదని ఆవేదనను వెలిబుచ్చారు. ఎపిజిఇఎ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 30 వరకు దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని సంఘ జనరల్ బాడీ తీర్మానం చేసిందన్నారు. సంఘ రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈనెల 5న సమ్మె నోటీసు జారీ చేశారన్నారు. ప్రధానంగా సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత పిఆర్‌సి అరియర్స్‌ను విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి తక్షణమే అమలు పరచాలని డిమాండ్ చేశారు ఈ ప్రభుత్వం ఇకనైనా తమ ఆందోళనకు స్పందించి 120 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి ఈదర విజయ భాను, ఉపాధ్యక్షులు వసుద్ అలీ, మామిడి రమణారావు, ఒంగోలు తాలూకా అధ్యక్షులు పుత్తూరు అనిల్ కుమార్ కార్యదర్శి డి. శ్రీకాంత్ రెడ్డి, ఒంగోలు టౌన్ కార్యదర్శి ఎం.శ్రీను, అసోసియేట్ ప్రెసిడెంట్ సి.తారక రామారావు, ఒంగోలు తాలూకాలోని ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలను అడ్డుకుందాం

భారత్ బచావో రాష్ట్ర నాయకుడు దుడ్డు ప్రభాకర్

మాట్లాడుతున్న దుడ్డు ప్రభాకర్

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

మనువాద కార్పొరేట్ ఫాసిస్ట్ విధానాలను అడ్డుకోవాలని భారత్ బచావో రాష్ట్ర నాయకుడు దుడ్డు ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగంభవన్‌లో భారత్ బచావో సంస్థ జిల్లా విస్తత సమావేశం సోమవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దుడ్డు ప్రభాకర్ మాట్లాడు తూ మనుస్మృతిని వ్యతిరేఒకించేందుకు భారత్ బచావో ఉద్యమం తోడ్పడుతుందన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రజాస్వామిక లౌకిక విధానాలను కాపాడాలనే 11 నినాదంతో ప్రజలలో విస్తృత ప్రచారం చేసి చైతన్యం కలిగిస్తున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాలన్నారు. వచ్చే ఎన్నికలలో బిజెపిని ఓడించేందుకు వారిని సన్నద్ధం చేయాలన్నారు. కర్ణాటక రాష్ట్ర అనుభవాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. భారత్ బచావ్ రాజకీయ పార్టీ కాదని, రాజకీయ అవగాహనతో పని చేస్తుందన్నారు. మతతత్వ పార్టీల ద్వారా దేశం ఎలా నష్టపోతుందో వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక నిరంకుశ విధానాలను ప్రచారం చేయాలన్నారు. అనంతరం భారత్ బచావో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రత్యూష సుబ్బారావు మాట్లాడారు. త్వరలో జిల్లా మహాసభలు జరపాలని ,అందుకు సన్నాహక కమిటీ ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అద్యక్షుడు చుండూరి రంగారావు. బిఎస్‌పి జల్లా అద్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి, సిపిఐ నాయకులు ఆర్. వెంకట్రావు, బిఎస్‌పి నాయకుడు మిరియం అంజిబాబు, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బరావు ,బచావో రీజనల్ కార్యదర్శి మాచర్ల మోహనరావు, న్యాయవాది కరిముల్లా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు, కెఎన్‌పిఎస్ జిల్లా నాయకులు జార్జ్, అంబేద్కరిస్టు గురవయ్య, సిఐటియు నాయకుడు ఎం.అయ్యపురెడ్డి ,ప్రజాకళా మండలి రాష్ట్ర కార్యదర్శి కోటి, కెఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి ఓసు శ్రీనివాసులు, ఎం.దేవప్రసాద్ ,జనార్ధన్, సుబ్రహ్మణ్యం , నూకతోటి రవి కుమార్, దాసరి సుందరం పాల్గొన్నారు .

భూ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-కంభం రూరల్

మండల పరిధిలోని ఎల్.కోట గ్రామ సర్వేనంబరు 986లో నాలుగున్నర ఎకరాల భూమిని పోసాని వెంకటయ్య అనే రైతు గత పాతికేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. అయితే రెవెన్యూ అధికారులు కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో నివాసం ఉంటూ రైల్వేలో ఉద్యోగం చేస్తున్న బొబ్బ యేసురత్నం అనే రైతుకు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా పట్టా మంజూరు చేసినట్లు పోసాని చిన్న వెంకటసుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై రైతు సంఘం జిల్లా నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చిన్నవెంకట సుబ్బయ్య తెలిపాడు.

జాతీయస్థాయి పోటీలకు పాకల విద్యార్థిని

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఎస్‌జీప్‌యు-19 బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు శింగరాయ కొండ మండలం పాకల విద్యార్థిని వాయల అర్చన ఎంపికైనట్లు కోచ్ పిల్లి హజరత్తయ్య తెలిపారు. విజయనగరం జిల్లాలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ స్టేడియంలో 21,22 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్చన పాల్గొని సత్తా చాటి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఢిల్లీలో జూన్ 6 నుంచి 12 వరకూ నిర్వహిస్తున్న జాతీయ కబడ్డీ పోటీలలో అర్చన పాల్గొనన్నుట్లు ఆయన తెలిపారు. వాయల అర్చన శింగరాయకొండ గవర్నమెంట్ జూనియర్ కళా శాలలో ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసింది. పాకల హైస్కూల్ పూర్వ విద్యార్థిని అయిన అర్చన కోచ్ పి.హజరత్తయ్య పర్య వేక్షణలో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో పోటీలో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తాను ఎంపిక కావడానికి సహకరించిన కోచ్ పి. హజరత్తయ్య ,జిల్లాస్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆదినారాయణ, గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, కళాశాల సిబ్బందికి ధన్య వాదాలు తెలిపింది.

ప్రచారం నిర్వహిస్తున్న పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి

రామాపురంలో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సిఎం జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాచర్ల మండలం రామాపురం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత రామాపురం గ్రామంలోని సిద్ద భైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ తనరాజకీయ ప్రస్థానం రామాపురం నుంచే ప్రారంభమైనట్లు తెలిపారు. తన హయాంలో గ్రామంలో జరిగిన అభివద్ధిని ప్రజలకు గుర్తుచేశారు. భవిష్యత్తులో తమ కుమారుడు ప్రవీణ్ కుమార్ రెడ్డిని రామాపురం గ్రామస్తులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొట్టికె రాజేశ్వర్ రెడ్డి, మదిరే శ్రీ రంగారెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

వాహనాలు అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు నియోజక వర్గ పురిధిలోని 9 మంది వికలాంగులకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ,ఎపిడిఎఎస్ సిఎసి చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ చేతుల మీదుగా సోమవారం మూడు చక్రాల మోటారు వాహనాలు సోమవారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ వాహనాలను ఉచితంగా అందచేసినట్లు జిల్లా మేనేజర్ జి.అర్చన తెలిపారు. ఒక్కొక్క వాహనం విలువ రూ.1.20 లక్షలు కాగా మొత్తం రూ.10.80 లక్షల విలువైన 9 వాహనాలను అందజేసినట్లు అర్చన తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరంలో మూడో తరగతి నుంచి ఆరో తరగతి వరకూ ప్రవేశానికి అర్హులైన బాలికలు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపల్ సిహెచ్. జయలక్ష్మి తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. అందులో ఎస్‌టిలకు 32, ఎస్‌సిలకు 5, బిసిలకు 2, ఒసిలకు ఒక సీటు కేటాయించినట్లు తెలిపారు. నాల్గో తరగతిలో 21, ఐదో తరగతిలో 11, ఆరో తరగతిలో 15 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఖాళీలను ఎస్‌టి విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి రూ. లక్ష లోపే ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు నేరుగా గురుకుల పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. తరగతుల వారీగా వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి లాటరీ పద్దతిలో సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ జయలక్ష్మి తెలిపారు.

సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలెందుకు..?

అధికారుల తీరుపట్ల సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రజలు సమస్యలు పరిష్కారించనప్పుడు సమావేశాలు ఎందుకని జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎం.మురళీకృష్ణ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాతూ గత సమావేశాల్లో సభ్యులు సభ దష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఎందుకు పరిష్కారించలేదో చెప్పాలని ఎంపిడిఒను నిలదీశారు. దీంతో ఎంపిడిఒ నీళ్ళు నమిలారు. సమావేశాలకు గైర్హాజరైన అధికారులకు మెమోలు ఎందుకు జారీ చేయలేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని జడ్‌పిటిసి ప్రశ్నించాడు. కాట్రగుంట పశువుల బీడు ఆక్రమణకు గురైందని ఆయా గ్రామాల ప్రజలు తహాశీల్దారు చుట్టూ ప్రదక్షిణలు

మాట్లాడుతున్న జడ్‌పిటిసి ఏడుకొండలు

చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి ఆ భూములను పరిశీలించి అలవి పశువుల బీడు లేక పట్టా భూమి అని తేల్చాలన్నారు. ఎంపిపి మూరబోయిన మురళీ కృష్ణ మాట్లాడుతూ సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు ఎందుకు తనఖీ చేయడం లేదని ప్రశ్నించారు. సిద్ధవరం, వద్దిమడుగు, గరివెనపాడు గ్రామాలలో విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలని గత సమావేశంలో సభ దష్టికి తెచ్చామని, ఇప్పటికీ ఆ సమస్య పరిష్కరించలేకపోవడం ఏమిటని ఎంపిటిసి, షేక్ మీరావలి, సర్పంచులు పిన్నిక పిచ్చయ్య, పాలూరి లక్ష్మీ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ బాలునాయక్ తెలిపారు. తహాశీల్దారు ప్రవీణ్‌కుమార్, ఎంపిడిఒ రావూరి జనార్ధన్, ఎంఇఒ ఢాంగే షరీఫ్, సిడిపిఒ సుధా మారుతి, ఎపిఎం గోపాలకృష్ణరెడ్డి, ఎపిఒ బుల్లెనరావు, ఎఒ ప్రసన్న రంగలక్ష్మి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు నిరంజన్, నారాయణస్వామి, కొనకనమిట్ల, గొట్లగట్లు, వైద్యాధికారులు బాలయ్య, నరేంద్ర, రేగడిపతి సింగిల్‌విండో అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

వికలాంగులకు ఈనెల 26న కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నట్లు వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాలరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌& బి గెస్ట్‌హౌస్‌లో కృత్రిమ అవయవాల పంపిణీకి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడుతూ కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, వై. పాలెంలలో ఆర్ & బి గెస్ట్‌హౌస్ వద్ద వికలాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా ప్రాంతాల వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దేవప్రసాద్, బ్రహ్మారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథపాలకుడు కోటేశ్వరరావు తెలిపారు. కొండపి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకల్టీ ఎం.శ్రీధర్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, జనరల్ నాలెడ్జ్ బోధించారు.గ్రంథపాలకుడు కథలు చెప్పడం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం** : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వార్తలు రాయడం, చిత్రలేఖనం, కథలు రాయడం, పేపర్ కటింగ్, గాలి పటాలు తయారు చేయడం తదితర వాటిపై గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ తల్లిదండ్రులు వేసవిలో తమ పిల్లలను బయట తిప్పకుండా గ్రంథాలయానికి పంపి వివిధ అంశాల్లో ప్రవీణ్యం పొందేలా కృషి చేయాలన్నారు. **పెద్దదోర్నాల** : విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలని పెద్దదోర్నాల గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వేసవి శిక్షణా శిబారంలో భాగంగా స్థాణిక శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు చెస్, క్యారమ్స్, గణితం, స్పోకెన్ ఇంగ్లీషుపై అవగాహన కల్పించారు. అనంతరం కథలు, కథనాలు, నృతనాత్మక కృత్యాలు నిర్వహించారు.

24న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మండలపరిధిలోని పిటికాయగుళ్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1988-89 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు కాల్వ శ్రీనివాసరావు, సత్యనారాయణ, మద్దుల సుబ్బారెడ్డి, శివప్రసాద్, రామిరెడ్డి, అల్లాబకాష్ ఖాన్. 1984-85, 1988-89 విద్యాసంత్సరాల్లో తమతో ఆరు నుంచి 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

నిశ్చితార్థ వేడుకల్లో జూపూడి, డాక్టర్ వెంకయ్య

నిశ్చితార్థ వేడుకల్లో జూపూడి

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని కారుమంచి గ్రామ వైసిపి సీనియర్ నాయకులు సిరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత సిరిపురపు విజయభాస్కర్ రెడ్డి కుమారుడి నిశ్చితార్థ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ప్రభుత్వ న్యాయ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి మండట అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరి రావు, వైస్ ఎంపిపి రావెళ్ల ప్రదీప్, నాయకులు బొట్ల రామారావు, నీరుకొండ సింగయ్య, డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ ఉన్నారు.

ఐరిష్ ద్వారా రేషన్ సరుకులు : తహాశీల్దారు

పజాశక్తి-టంగుటూరు

వేలిముద్రలు పడక రేషన్ సరుకులు తీసుకోలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. జూన్ 1 నుంచి ఐరిష్ ద్వారా రేషన్ సరుకులు పొందవచ్చని తహాశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తహాశీల్దారు మాట్లాడారు. రేషన్ మొబైల్ వాహనదారుల ఎండియు ఆపరేటర్లకు ఐరిష్ యంత్రాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. రేషన్ తీసుకునేందుకు మొబైల్ వాహనాల వద్దకు వచ్చే పేదలు తమ వేలిముద్రలు పడని పక్షంలో ఐరిష్ ద్వారా బయోమెట్రిక్‌ను పూర్తి చేయవచ్చన్నారు. తద్వారా రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారు ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ సరుకులను తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో మొత్తం 385 మంది మొబైల్ రేషన్ వాహనదారులకు ఐరిష్ యంత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. వేలిముద్రలు పడక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దారు సంజీవరావు సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కనిగిరి

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, రాష్ట్ర బాలలహక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బాలలహక్కుల పరిరక్షణపై నియోజకవర్గ స్థాయిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలిగించే వారిపట్ల ఉపేక్షించకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి ప్రకాశం, జడ్‌పిటిసి మడతల కస్తూరిరెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరావు,గుడ్‌హెల్ఫ్ ప్రతినిధి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పాత్ర కీలకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడమే గ్రామ వాలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో గ్రామ వాలంటీర్ల వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వాలంటీర్లకు అందించడంతో వాలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. నంతరం ఉత్తమ వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్లపాటి సుధారాణి, ఎంపిడిఒ కె. కుసుమకుమారి, ఎఎంసి చైర్మన్ వైవి. సుబ్బయ్య, రాష్ట్ర

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ బత్తినీడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు విసిరెడ్డి, మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు అచ్చయ్య, మురళి, రాము తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి-కనిగిరి

మండల పరిధిలోని నాగులవరం గ్రామానికి చెందిన అఖిల అనే గర్భిణికి సోమవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కనిగిరికి చెందిన 108 అంబులెన్స్ ఇఎంటి శ్రీనివాస్,ఫైలెట్ కోటేశ్వరరావు నాగులవరం వెళ్లి అంబులెన్స్‌లో అఖిలను కనిగిరి వైద్యశాలకు తరలిస్తున్నారు. మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 కాల్‌సెంటర్ డాక్టర్ మనోహర్ సూచన మేరకు 108 సిబ్బంది ప్రసవం చేశారు. అఖిల మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారు. అఖిలకు సుఖప్రసవం చేసిన ఇఎంటి శ్రీనివాస్, ఫైలెట్ కోటేశ్వరరావును పలువురు అభినందించారు.

రాష్ట్రంలో అవినీతి పాలన : గూడూరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. కరెంటు బిల్లులు, బస్‌ఛార్జీలు, గ్యాస్ ధరలు పెరగడంతో ప్రజలకు భారం పెరిగిందన్నారు. అభివృద్ధి లేకపోవడంతో ప్రజలంతా ఇదేమి ఖర్మ అంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం నేర్పే రోజులు దగ్గర పడ్డాయి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయ దుందిభి మోగిస్తుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర కార్యాలయానికి

ప్రజల నుంచి వచ్చిన వినతులు

పంపి వాటి పరిష్కారానికి అవసరమైన పోరాటాలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల సత్యనారాయణ గౌడ్, తోటా మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రమణ్యం, గురిజేపల్లి జిలాని, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-కొండపి

పార్టీలకు అతీతంగా అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని పెదకండ్లగుంట గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.తొలుత కొండపి నుంచి పెదకండ్లగుంట గ్రామం వరూ వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబును ఎడ్ల బండిపై ఊరేగించారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ సంఘం చైర్మన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణవెంకటాద్రిరెడ్డి, గ్రామ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకుడు భువనగిరి సత్యనారాయణ, ఎంపిటిసి బి.రామారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతో సమస్యల పరిష్కారం

సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరావు, కె ధనలక్ష్మి ● పర్స సత్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీరాల

సంఘటిత పోరాటాలతో కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ దిశగా పోరాటాలు కొనసాగించాలని సిఐటియు రాష్ట్ర నాయకురాలు కె ధనలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమా మహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర నాయకురాలు కే ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. సమావేశం ముందుగా సాయుధ రైతాంగ పోరాటయోధుడు, కార్మిక ఉద్యమ నిర్మాత, ఆదర్శనేత, అమరజీవి కామ్రేడ్ పర్స సత్యనారాయణ 8వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కార్మిక ఉద్యమ నిర్మాణంలో కామ్రేడ్ పర్స సత్యనారాయణ కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ కొత్తగూడెంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారన్నారు. అసెంబ్లీలో కార్మిక సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో రాష్ట్రంలో కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని చెప్పి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పలు అంశాల గురించి వివరించారు. సిఐటియు రాష్ట్ర నాయకురాలు కె ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుతూ బిజెపి మతతత్వ విధానాలపై కార్మికుల్లో ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎం వసంతరావు, తిరుమలరెడ్డి, ప్రతాప్ కుమార్, కే శ్రీనివాసరావు, రేఖ ఎలిజిబెత్, ధనలక్ష్మి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పర్స సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

మజ్జిగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామానగర్‌లోని డాక్టర్ మధు క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర సోమవారం అసోసియేషన్ సభ్యుడైన పింజల భాస్కర్ వర్ధంతి సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. పులిహోర, స్వీట్స్‌ను కూడా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పింజల సాంబశివరావు మాట్లాడుతూ వేసవిలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పాదచారులు, ప్రజల వేసవి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ నన్నపనేని సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు శివయ్య, జనరల్ సెక్రెటరీ గుగ్గిలం శ్రీహరి, ఆర్గనైజర్ అండ్ ట్రెజరర్ పేరిసెట్ల బ్రహ్మయ్య సభ్యులు డాక్టర్ మధు. సోమరాజు, వూట్ల వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కాకునుల్ల రమేష్‌బాబు, బుద్ధి శ్రీను, రామిశెట్టి మస్తాన్‌బాబు, రాహుల్, జమ్మి ప్రసాద్‌రెడ్డి, ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

వైద్య రంగంలో ప్రకాశం, బాపట్ల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలం గంగవరం సొసైటీ బిల్డింగ్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు, కిడ్నీ, విషజ్వరాలు లాంటి వ్యాధులకు వైద్యులు సూచనలు అందజేశారు. రోగ నిర్ధారణ జరిగిన 50 మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ రామాంజనేయులు, రాణి, కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు.

వైద్యసేవలందిస్తున్న కిమ్స్ డాక్టర్

సిపిఎం సానుభూతిపరుడు ముమ్మలనేని వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-రేపల్లె

సిపిఎం సానుభూతిపరుడు ముమ్మలనేని వెంకటేశ్వరరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ సంతాపం తెలిపారు. రేపల్లెలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. రేపల్లె మాజీ ఎమ్మెల్యే మోటూరు హనుమంతరావు, కొరటాల సత్యనారాయణతో మంచి సంబంధాలు కలిగి ఉండి రేపల్లె పాత తాలూకా సిపిఎం సభ్యులుగా పనిచేశారు. కొరటాల అనంతరం రేపల్లె ఉద్యమాల్లో పనిచేస్తూ సిపిఎం నాయకులకు అండదండలుగా ఉండేవారు. రేపల్లె సిపిఎం కార్యాలయ నిర్మాణ కమిటీ సభ్యులుగా ఉండి కార్యాలయ నిర్మాణ ఏర్పాటుకు కీలకపాత్ర పోషించారు. తదనంతరం అనారోగ్య కారణాలతో పార్టీ సానుభూతిపరులుగా ఉంటూ తుది శ్వాస విడిచే వరకు కొనసాగారని అన్నారు. వెంకటేశ్వరరావు మృతికి సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

వెంకటేశ్వరరావు

సినీ గీత సుమధుర ఝరి 'వేటూరి'

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు సినీ సాహిత్య సుమధుర ఝరి వేటూరి అని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 13వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో వేటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వర్మ మాట్లాడుతూ 18 వందల సినిమాలకు 6 వేల పైచిలుకు పాటలు రచించిన విశిష్ట కవి వేటూరి సుందరరామమూర్తి అన్నారు. సందర్భోచితంగా పాటలు రాసిఇవ్వగల ప్రత్యేకత రచనా శైలి కలిగిన ఏకైక కవి వేటూరి అన్నారు. ప్రజాకవి డాక్టర్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ వేటూరి, కె విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఓ సీత కథ సినిమా ద్వారా సినీ రంగ ప్రవేశం చేసి తెలుగు సినీ సాహితీ జగత్తును సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రి, ఆదం షఫీ, ఎన్ కృష్ణ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళి, రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించండి: బాచిన కృష్ణచైతన్య

ప్రజాశక్తి-పంగులూరు

పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరుస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించాలని, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా, మూడో రోజు అయిన సోమవారం సాయంత్రం ముప్పవరం గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లోని పేదలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని, ఆ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రి అయితే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరికొన్ని కొత్త పథకాలను కూడా తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటున్న వైసీపీని, జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించటమే పనిగా పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని నమ్మవద్దని అన్నారు. ప్రతి ఇంటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను గృహ యజమానులకు చూపుతూ, ఆ పథకాల ద్వారా ఆ కుటుంబాలు ఎంత లబ్ధి పొందింది కృష్ణ చైతన్య వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సేవాదళ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు పులికం కోటిరెడ్డి, గ్రామ సర్పంచి సాంబశివరావు, ఎంపిటీసీ గంగాధర్, ఎంపీడీవో రమణమూర్తి, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మండల అభికృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకటసుబ్బారావు, వైసిపి స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూలో ప్రజలతో మాట్లాడుతున్న బాచిన కృష్ణ చైతన్య

పోలీసు స్టేషన్లలో వినతిపత్రం ఇస్తున్న జనసేన కార్యకర్తలు

ఇసుక దొంగతనాలను అరికట్టండి

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని ఇసుక రీచ్‌లో అక్రమంగా తవ్వకాలతో దొంగిలిస్తున్న ఇసుక దొంగలను అరికట్టాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోము రౌతు అనురాధ, ఇతర నాయకులు కొల్లూరు, వేమూరు పోలీస్ స్టేషన్లలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోము రౌతు అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలు చేస్తున్న ఇసుక పాలసీలో భాగంగా జై ప్రకాష్ పవర్ లిమిటెడ్ వారితో ఒప్పందం ఈ నెల రెండో తేదీతో పూర్తయిందని సంబంధిత అధికారులు ఇసుకను తవ్వకాలు నిలుపుదల చేయాలని జయ ప్రకాష్ వెంచర్స్ వారికి నోటీసులు ఇచ్చారు. అయినా వారిలో స్పందన లేదని, ఇసుక తవ్వకాలు జెసిబితో విపరీతంగా జరిపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని వారు పేర్కొన్నారు.

విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం

ప్రజాశక్తి-అద్దంకి

ప్రఖ్యాత సాహితీ వేత్త, కథకులు విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఒంగోలులో వారి కుమార్తె నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. రాయలసీమ ప్రజా జీవితాన్ని కథల్లో కళ్లకు కట్టినట్లు చిత్రించిన రచయిత ఆచార్య విశ్వనాథరెడ్డి కథకులుగా, విమర్శకులుగా తెలుగు సాహిత్యానికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్‌దత్, కార్యదర్శి కేశవమఠం అనిల కుమార సూరి, సంకా సుబ్రహ్మణ్యం (బాబు) షేక్ మహమ్మద్ రఫీ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇల పావులూరి శేష తల్ప సాయి, కందుల నాగిరెడ్డి, ఆనంతు నాగేశ్వర రావు, మలాది శ్రీనివాసరావు, అద్దంకి లెవి ప్రసాద్, జ్యోతి చంద్రమౌళి, పిసిహెచ్ కోటయ్య, సృజన సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణంలోని 9వ వార్డులో యల్లాల శ్రీనివాసరావు, వారి సోదరుడు శ్రీనివాసరావు ఇరువురు ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ వారిని పరామర్శించారు. ఆరోగ్య విషయమై వాకబు చేశారు. పట్టణ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పసుమర్తి సామేలు తండ్రి యోహాను ఇటీవల స్వర్గస్తులు కాగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే 17వ వార్డులోని పెరికపాలెంలో బొడ్డు చిన్న బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలి శస్త్రచికిత్స చేయించుకోగా వారిని పరామర్శించారు. అదేవిధంగా 17 వార్డులో కటకం అనిల్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించారు. సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో మందలపు కోటయ్య నిర్యాణానికి హాజరై కోటయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథ పాలకుడు సిహెచ్ సుగుణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్, వ్యాసరచన, స్టోరీ టెల్లింగ్, క్విజ్ కార్యక్రమాలను ఏర్పాటు చేసి మెలకువలను నేర్పారు. ఈ కార్యక్రమంలో సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు వీరు పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డి మరణం

సాహిత్యానికి తీరని లోటు

అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రముఖ కథా రచయిత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి(84) మరణం తెలుగు కథా సాహిత్యానికి తీరని లోటు అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఒంగోలులో నివసిస్తున్న వారి కుమార్తె నివాసానికి వచ్చిన ఆయన సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో వైద్య పరీక్షలు కోసం రమేష్ సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్లో తరలించిన కొద్దిసేపటికే మరణించడంతో వారి అభిమానులు, అరసం, సీపీఐ నాయకులు, పలువురు కవులు, రచయితలు హాస్పిటల్లో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంలో అనేక కథలను రచించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారని అన్నారు. కడప జిల్లా గ్రామ నామాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను పొందారని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సిపిఐ రాజకీయ విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడారు. వీరితో పాటు సిపిఐ సీనియర్ నాయకులు కె.వెంకయ్య, జానుడి అధ్యక్షులు డాక్టర్ నూకతోటి రవికుమార్, నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు టి.అరుణ. సింహాద్రి జ్యోతిర్మయి, కళామిత్ర మండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సాహితీ విమర్శకులు శ్రీరామకవచం సాగర్ తదితరులు పాల్గొని కేతు విశ్వనాథరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వారి కుమార్తెను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'రమేష్' సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

రాష్ట్రంలో అత్యాధునిక గుండె మరియు ఇతర వైద్య సేవలు అందిస్తూ ఎన్నో మన్ననలు పొందుతున్న రమేష్ హాస్పిటల్స్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ఒంగోలులో సత్యనారాయణపురం, కరవాది వారి వీధిలో సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ఎం.ఎస్. రామ్మోహన్‌రావు, ఎస్‌పి మల్లికగర్గ్ హాజరయ్యారు. పోలీస్ సూపరింటెండెంట్ మల్లికగర్గ్ రిబ్బన్ కట్ చేయగా ఎండీ, డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, డాక్టర్ రాయిపాటి మమత, డాక్టర్ కె.హరికుమార్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ క్లినిక్‌ను రమేష్ హాస్పిటల్స్‌లో భాగమైన ఒంగోలు రమేష్ సంఘమిత్ర హాస్పిటల్ నిర్వహిస్తుందని తెలియజేశారు. అనంతరం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత, సి.ఓ.ఓ డాక్టర్ కె.హరికుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వై. కార్తీక్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

క్రీడాకారిణి రాజేశ్వరికి అభినందనలు

ఏషియన్ పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో పతకాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారిణి గల్లు రాజేశ్వరిని పలువురు అభినందించారు. ఈనెల 12 నుంచి 20 వరకు దక్షిణ కొరియా దేశంలో "ఏషియన్ పసిఫిక్ మాస్టర్స్ దేశం తరుపున 83 విభాగ క్రీడల నందు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా నుండి నలుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలలో డిస్కస్ త్రో గల్లు రాజేశ్వరి దేశం తరపున పాల్గొని బంగారు పతకం, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో రజత పతకం అందుకున్నారు. దక్షిణ కొరియా నుంచి సోమవారం ఒంగోలు చేరుకున్న కల్లు రాజేశ్వరిని స్థానిక ఒంగోలు రైల్వేస్టేషన్ నుండి బంగోలు నగర ప్రజలు, క్రీడాభిమానులు వారి కుటుంబసభ్యులు వారి స్వగృహం సమతానగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో కల్లు రాజేశ్వరి మాట్లాడుతూ విద్యాభ్యాసం అనంతరం బేస్తవారిపేట మండలం గంటాపురంకి చెందిన చప్పిడి మరియదాస్ తో వివాహం జరిగిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఆటలలో ఆసక్తి తగ్గకపోవడంతో భర్త సహకారంతో తిరిగి ప్రారంభించానన్నారు. అప్పటి నుంచి జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి ఆటల పోటీలలో పాల్గొని పతకాలు సాధించినట్లు వివరించారు. సౌత్ కొరియా నందు జరిగే ఏషియన్ ఫసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో అర్హత సాధించిన తాను పతకాలు సాధన కోసం గంటల తరబడి ప్రాక్టీస్ చేశానన్నారు. జిల్లా నుంచి క్రీడలలో పాల్గొనటానికి వెళ్ళేందుకు అవసరమైన సాయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసి దయార్ధ్ర హృదయాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే కాలంలో ప్రభుత్వ సహకారంతో దేశ పేరు ప్రఖ్యాతులు పెంచేలా శాయశక్తుల శ్రమిస్తానని తెలియజేశారు. దక్షిణ కొరియా దేశంలో జరిగిన పోటీలలో పతకాలు సాధించిన గల్లు రాజేశ్వరిని ప్లాన్ ఇండియా స్పోర్ట్స్ సెక్రటరీ దాసరి భాస్కరరావు, ఎపిసిపిఒసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ టంగా సాంబశివరావు, చిల్లంకొండ సురేష్, కెవి రవి, రంగుల ఆర్ట్స్ గ్యాలరీ నిర్వాహకులు సంధ్య రంగుల, కుటుంబ సభ్యులు అభినందించారు.

రాజేశ్వరిని అభినందిస్తున్న దృశ్యం


గడపగడపకూ..లో పాల్గొన్న మంత్రి సురేష్

ఆర్థిక భరోసా కల్పించేందుకే పథకాలు

మంత్రి సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత అన్నలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం త్రిపురాంతకం మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, తహశీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గాలి వెంకటరామిరెడ్డి

కరువు నుంచి కాపాడాలని ధర్నా

ప్రజాశక్తి-గిద్దలూరు

సాగు, తాగు నీరందించి నియోజక వర్గాన్ని కరువు నుంచి కాపాడాలని స్థానిక రైతులు సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక స్పందన కార్యక్రమం బయట ఆందోళన చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గాలి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నీళ్లు లేక రైతులు కరువుతో అల్లాడుతున్నారని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టులో నిర్వాసితులైన వారిలో 2019 నాటికీ 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకులు 1000 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజిలో గుర్తింపు ఇవ్వాలన్నారు. ధర్నాలో గిద్దలూరు ఏరియా కార్యదర్శి రామకష్ణ మరియు రవి కష్ణారెడ్డి, అప్పల స్వామి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలో ప్రసిద్ధి చెందిన త్రిపురాంతకేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరీదేవి ఆలయాలను శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయాల్లో శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి స్పీకర్‌కు వివరించారు. కార్యక్రమంలో కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మితో పాటు వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను

క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని చీతీరాల కళ్యాణ మండపంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన (జగనన్న కు చెబుదాం) కార్యక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని 40 సచివాలయ పరిధిలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు వాటిల్లో సాంకేతికపరమైన సమస్యలతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆక్రమణలపై విచారణకు ఆర్డీవో ఆదేశం

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి
కథనానికి స్పందన

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కనిగిరి- ఒంగోలు మార్గంలో గల సూరాపాపిరెడ్డి నగర్‌లోని పేదల జాగా, పక్కనే ఉన్న వాగు పోరంబోకు భూమి ఆక్రమణపై ఆర్డీవో అజయ్‌కుమార్ స్పందించి.. విచారణకు ఆదేశించారు. ఆక్రమణలపై సోమవారం ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో 'కబ్జా చేస్తాం..అమ్మేస్తాం..' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే.. ఆక్రమణదాలరుపై చర్యలు తీసుకొని.. ఆక్రమణలను అరికట్టాలని సోమవారం కనిగిరి పట్టణ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సిపి కేశవరావు ఆధ్వర్యంలో నాయకులు ప్రజాశక్తిలో వచ్చిన కథనాన్ని ఆర్డీవోకు చూపించి.. వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో స్పందించి.. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకొని ఆక్రమణలు జరిగిన ప్రదేశాన్ని సందర్శించి.. విచారణ చేయాలని ఆదేశించారు.

వేలిముద్రలు పడని వారికి

ఐరిష్ ద్వారా సరుకులు పంపిణీ

ఒంగోలు తహశీల్దార్ మురళి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

వేలిముద్రలు పడలేదని రేషన్ ఇవ్వకుండా ఉండే అవసరం లేకుండా కన్నుల స్కాన్ ద్వారా రేషన్ సరుకులు అందజేసేందుకు స్కాన్ పరికరాలను అందజేస్తున్నట్లు ఒంగోలు తహశీల్దార్ మురళి తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈ స్కానర్లను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడులూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ అందజేయాలనే దృక్పథంతో ఉందని తెలిపారు. ఎవరూ వేలిముద్రలు పడని కారణంగా సరుకులు రావడం లేదనే ఫిర్యాదు రాకూడదనే ప్రభుత్వం స్కాన్ పరికరాలను అందజేస్తోందన్నారు. రేషన్ కార్డుదారులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటిలు రామ క్రిష్ణ, అశోక్, రామానాయుడు పాల్గొన్నారు.

ఐరిష్ పరికరాలను అందజేస్తున్న తహశీల్దార్ మురళి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు

ఈఎండీ డిపాజిట్ డబ్బు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు రావాల్సిన ఈఎండి డిపాజిట్ డబ్బు వెంటనే చెల్లించాలి కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురం పురపాలక సంఘం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ 73 మంది ఇంజనీరింగ్ కార్మికులు సొసైటీలకు డిపాజిట్ చెల్లించిన మొత్తాన్నీ సొసైటీ అధ్యక్షులు తమ సొంత అవసరాల కోసం వినియోగించుకున్నారన్నారు. డబ్బులను తిరిగి చెల్లించాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం మార్కాపురం మున్సిపాల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లాఅధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గొట్టం హరికష్ణ, గురునాథం కనకయ్య, సుబ్బయ్య, షేక్ యూసఫ్, జి అల్లూరయ్య, నారాయణ రెడ్డి, టి శేషు తదితరులు పాల్గొన్నారు.


ఛైర్మన్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు